సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



కేతేపల్లిలో విషాదఛాయలు
సూర్యాపేట మండలం రాయినిగూడెం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు.
- 8లో



పోలీసుల తనిఖీలు
చండూరు వద్ద గురువారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.85,000 స్వాధీనం చేసుకున్నారు.
- 8లో



కేవీకేలో నెదర్లాండ్స్ మంత్రి
గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం నెదర్లాండ్స్ దేశ మంత్రి సందర్శించారు.
-10లో

న్యూస్‌రీల్

కానిస్టేబుల్ సస్పెన్షన్

పాలకవీడు: ఎన్నికల నిబంధనల ఉల్లంఘన, విధి నిర్వహణలో బాధ్యతలు విస్మరించినందుకుగాను పాలకవీడు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పాలకవీడు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ విష్ణు ఇటీవల ఓ రాజకీయ నేత జన్మదిన వేడుకల్లో పాల్గొన్నట్లు లభించిన ఆధారాల మేరకు అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రైస్ మిల్లుల్లో తనిఖీలు



వెంకటేశ్వర రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్, ఆర్డీఓ తదితరులు

కోదాడరూరల్: ధాన్యం తీసుకున్న రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను త్వరితగతిన అందించాలని అదనపు కలెక్టర్ లత ఆదేశించారు. గురువారం కోదాడ పట్టణ పరిధిలోని వెంకటేశ్వర, లక్ష్మీగణపతి రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు మిల్లర్లు బియ్యం ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తీసుకుంటున్న మిల్లుల యాజమాన్యాలు తరుగు పేరుతో రైతులకు ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. ఆమె వెంట డీఎస్ఓ మోహన్‌బాబు, ఆర్డీఓ సూర్యానారాయణ, తహసీల్దార్ సాయాగౌడ్, డీటీసీఎస్ రాంరెడ్డి ఉన్నారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి



తిమ్మాపురం కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

అర్వపల్లి: రైతులు వరి పంట కోయగానే ధాన్యాన్ని పొలాల వద్దే ఆరబెట్టి, శుభ్రం చేసి తేవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు వరి కోయగానే పచ్చి ధాన్యాన్ని నేరుగా కేంద్రాలకు తెచ్చి ఆరబోయడం సరికాదన్నారు. ధాన్యం ఆరబెట్టి, శుభ్రం చేశాక 17 శాతం వరకు తేమ ఉండేలా చూసుకొని కేంద్రానికి తెస్తే ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుందని తెలిపారు. కేంద్రాల్లో రైతులు పోసుకున్న ధాన్యం సీరియల్ ప్రకారం నిర్వాహకులు కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యాన్ని త్వరితగతిన కాంటా వేసి మిల్లులకు ఎగుమతి చేయాలన్నారు. కేంద్రాల్లో నిర్వాహకులు రైతులకు తగిన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శశిధర్‌రెడ్డి, ఏఈఓ సత్యం, వీఓఏలు దేవరకొండ విజయ, చంద్రకళ ఉన్నారు.

పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



నల్లబండగూడెంలో రికార్డులు పరిశీలిస్తున్న కుమారస్వామి

కోదాడరూరల్: వేసవిలో పశువులు వడదెబ్బకు గురికాకుండా, వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి సిబ్బందికి సూచించారు. గురువారం కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం పశువైద్య ఆరోగ్యకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పశువులు వడదెబ్బకు గురికాకుండా ఉదయం 10 గంటల లోపు సాయంత్రం నాలుగున్నర గంటల తర్వాత మేపుకోవాలన్నారు. పచ్చిగడ్డి కొరతను అధిగమించేందుకు పశుగ్రాసాల సాగును ప్రోత్సహించే విధంగా రైతులను చైతన్య పరచాలన్నారు. గ్రామాల్లోని ప్రత్యేకాధికారుల సమన్వయంతో పశువులకు తాగు నీరు అందుబాటులో ఉండే విధంగా నీటితొట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట పశువైద్యాధికారి శేఖర్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఈద్ ముబారక్





రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నిమ్మకు తెగుళ్లు



నడిగూడెం మండలం బృందావనపురం వద్ద ఎండిపోయిన నిమ్మ చెట్లు



చెన్నకేశ్వాపురం వద్ద తెగులు ఆశించిన నిమ్మ చెట్టు

- ఎండిపోతున్న తోటలు
- పురుగు మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని చీడపీడలు
- నష్టపోతున్న రైతులు

నడిగూడెం: జిల్లాలో మామిడి తోటల తరువాత అధికంగా సాగు చేసేది నిమ్మ. అది కూడా నడిగూడెం మండలంలో నిమ్మ సాగు జిల్లాలోనే మొదటి స్థానంలో ఉంది. నడిగూడెం మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరవిరాల, వెంకట్రాంపురం, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, వల్లాపురం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట తదితర గ్రామాల్లో దాదాపు 2,500 ఎకరాలకు పైగా నిమ్మ సాగులో ఉంది.

చీడపీడలతో ఎండిపోతున్న తోటలు

మండల వ్యాప్తంగా గత కొద్ది నెలలుగా నిమ్మ తోటలకు చీడపీడలు ఆశించి తీవ్రంగా నష్టాన్ని కలుగజేస్తున్నాయి. పురుగు మందులు, తెగుళ్ల మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావడం లేదని రైతులు చెబుతున్నారు. మండలానికి చెందిన పలువురు నిమ్మ రైతులు, కోదాడ, ఖమ్మం, కూసుమంచి, గుంటూరు ప్రాంతాల నుంచి పురుగు మందులు, తెగుళ్ల మందులను తీసుకొచ్చి పిచికారీ చేస్తున్నారు. అయినా తెగుళ్లు అదుపులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి ఎండుపుల్ల, తామరపురుగు, గజ్జి తెగుళ్లు విపరీతంగా ఆశిస్తున్నాయని, దీంతో పంట దిగుబడి అంతంత మాత్రమే వస్తుందని పేర్కొంటున్నారు.

గత నాలుగేళ్లుగా నష్టాల బాటలోనే..

భారీ ఈదురు గాలులతో చెట్లు కూలడంతో పాటు కాయలు రాలడంతో కొంత నష్టం వాటిల్లుతుంటే, మార్కెట్‌లో మద్దతు ధర పలకకపోవడంతో గత్యంతరం లేక దళారులు చెప్పిన ధరలకు విక్రయిస్తున్నారు. రోజురోజుకూ పెట్టుబడులు పెరుగుతున్నాయని, ఆదాయం మాత్రం అంతంత మాత్రంగానే వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో మాత్రం కిలో నిమ్మ రూ.80 పలికింది. తర్వాత మద్దతు ధర తగ్గింది. దీంతో మార్కెట్‌లో గత్యంతరం లేక విక్రయిస్తున్నామని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

సలహాలిచ్చే వారు లేకపోవడంతో..

నిమ్మ తోటలు అధికంగా ఉన్న చెన్నకేశ్వాపురం, కరివిరాల, వేణుగోపాలపురం గ్రామాల్లో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల ద్వారా నిమ్మసాగులో మెలకువలపై అవగాహన సదస్సులు నిర్వహించేవారు. కానీ గత నాలుగేళ్లుగా ఉద్యానవన శాఖలో సిబ్బంది కొరతతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. దీంతో రైతులు అవగాహన లేమితో పురుగు మందుల వ్యాపారులు ఇచ్చే మందులను మోతాదుకు మించి ఉపయోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో నిమ్మ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

నిమ్మ చెట్లు ఎండిపోతున్నాయి



నాకున్న ఎకరం నిమ్మ తోటలో గత కొద్ది నెలలుగా చెట్లు ఎండిపోతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి అనేక రకాల పురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. పెట్టుబడులు పెట్టలేక తోటను వదిలేశాను. సంబంధిత అధికారులు పర్యటించి, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– గందు గోపయ్య నిమ్మ రైతు, బృందావనపురం

అవగాహన కల్పించాలి



నిమ్మ సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు. దీంతో నిమ్మ చెట్లకు పురుగు ఆశించిందో లేక, తెగులు ఆశించిందో తెలియక ఇష్టారాజ్యంగా తెగుళ్ల మందులు ఉపయోగిస్తున్నాం. రోజు రోజుకూ పెట్టుబడులు పెరుగుతున్నాయి. కానీ మద్దతు ధర లేక నష్టపోతున్నాం. సంబంధిత అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– నక్క చంద్రం, కరివిరాల

24గంటలూ పోలీస్ నిఘా : ఎస్పీ

సూర్యాపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 24 గంటలూ పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వెంట నిఘా ఉంచామని పేర్కొన్నారు. సరిహద్దు వెంట, రామాపురం క్రాస్ రోడ్డు, మట్టపల్లి బ్రిడ్జి, దొండపాడు, పులిచింతల ప్రాజెక్టు వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నగదు అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. టేకుమట్ల వద్ద, బీమారం వద్ద, పాత తిరుమలగిరి, వెలిశాల వద్ద, మామిళ్లగూడెం, శాంతినగర్, చిల్లేపల్లి, కుంటపల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పారామిలటరీ సిబ్బంది, ఇతర శాఖల అధికారుల సాయంతో జిల్లా అంతటా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.కోటి 71లక్షల నగదు, రూ.7లక్షల 75వేల విలువ గల మద్యం, రూ.20వేల విలువ గల గంజాయి, రూ.కోటి 14లక్షల ఆభరణాలు, రూ.86లక్షల విలువ గల ఎలక్ట్రానిక్ వస్తువులు సీజ్ చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.75లక్షల విలువ గల మద్యం సీజ్ చేశామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం రూ.4కోట్ల 55 లక్షలు సీజ్ చేసినట్లు ఎస్పీ వివరించారు.

బందోబస్తు పరిశీలన



బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన కోసం చేసిన బందోబస్తును ఏర్పాట్లను ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదులు, ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ట్రైనీ ఐపీఎస్ రాజేష్‌మీనా, డీఎస్పీ రవి, సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్ ఉన్నారు.

ఇతర పార్టీల అభ్యర్థులకు పోరాట చరిత్ర లేదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని ఎంవీఎన్ భవన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు పోరాట చరిత్ర లేదన్నారు. కేవలం డబ్బు సంచులతో వచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాదంలో పడిందని, ఈ పరిస్థితుల్లో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని కాపాడుకునేందుకు ఎర్రజెండాల ప్రాతినిధ్యం పార్లమెంట్‌లో ఉండాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఎంతోమంది అమరవీరులు తమ ప్రాణాలను ప్రజల కోసం త్యాగం చేసి పేదలకు 10 లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. అంతటి చరిత్ర కలిగిన ఎర్ర జెండాను ఆదరించి, ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కి పంపించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుఫర్కపూజ, మాంగల్యధారణ జరిపించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫూలే ఆశయాలను సాధిద్దాం



జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటరావు, జిల్లా అధికారులు

- కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మహాత్మా జ్యోతిరావ్ పూలే ఆశయాలను సాధిద్దామని కలెక్టర్ వెంకటరావు పిలుపునిచ్చారు. గురువారం జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని ఎంజీ రోడ్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. కుల వ్యవస్థలో లోపాలను గుర్తించి ఆనాడే సామాజిక సమానత్వ సాధనకు జ్యోతిరావ్ పూలే ఎంతో కృషి చేశారన్నారు. మహిళల చదువుతో కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఆలోచించి వారి చదువుకు స్వయంగా పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. అణగారిన వర్గాల వారికి సమాన హక్కులు, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధికి పూలే కృషి చేశారన్నారు. సత్యశోధక్ అనే సంస్థను స్థాపించి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సాంఘిక సమానత్వం కోసం కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, డీఎస్ఓ మోహన్ బాబు, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగదీష్ రెడ్డి, జెడ్పీ సీఈఓ కిషన్, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ జనరల్ సెక్రెటరీ దున్న శ్యామ్, కలెక్టరేట్ ఏఓ మధుసూదన్ రెడ్డి, ఆర్డీఓ వేణు మాధవ్, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, డీఎల్‌పీఓ ఎస్తేర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు వసతులు కల్పించాలి

దురాజ్‌పల్లి(సూర్యాపేట): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటరావు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఆర్‌డీఓ, డీఎస్ఓలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు రవాణా చేయాలన్నారు.

మరమ్మతు పనులు పూర్తిచేయాలి



బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేటటౌన్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సూర్యాపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసిన స్కూళ్లలో విద్యుత్, తాగునీటి సరఫరా, టాయిలెట్ల మరమ్మతులు చేపట్టాల్సిన ఇతర పనులను కమిటీ సభ్యులు, స్కూల్ హెచ్‌ఎం ఇతర అధికారులు కలిసి పరిశీలించాలని సూచించారు. ఆయా పనులను స్కూల్స్ ప్రారంభమయ్యే లోగా పూర్తి చేయాలన్నారు. పనులపై ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారి ప్రసాద్ తదితరులున్నారు.

‘భవిత’ విద్యార్థులకు భత్యం

- 1,090 మందికి రూ 34.76 లక్షల నిధులు
- విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తున్న ప్రభుత్వం
- లబ్ధిదారుల కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు



హుజూర్‌నగర్‌లోని భవిత కేంద్రంలో విద్యార్థులు (ఫైల్)

హుజూర్‌నగర్: దివ్యాంగ విద్యార్థులకు ఇంటి వద్ద తర్ఫీదు ఇవ్వడంతోపాటు, భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి క్రమంగా వారిలో మార్పు తెచ్చి పాఠశాలల్లో చేర్పించేలా ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇలాంటి విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నెలనెలా రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ అలవెన్సులు అందిస్తోంది. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర శిక్షా తెలంగాణ, పీఎంశ్రీ ఆధ్వర్యంలో విడుదల చేస్తాయి. విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమ చేస్తుండడంతో ఆ కుటుంబాల్లో కాస్త ఆర్థిక వెసులుబాటు కలుగుతోంది. అయితే జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 1,090 మంది విద్యార్థులకు రూ.34.76 లక్షలు నిధులు రావాల్సి ఉండగా.. వాటిని సంబంధిత లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తోంది.

జిల్లాలో 28 భవిత కేంద్రాలు..

మానసిక, శారీరక వైకల్యం కలిగిన బాల బాలికలకు వివిధ పద్ధతుల్లో విద్య అందించడానికి ప్రభుత్వం విలీన విద్యా వనరుల కేంద్రాలు (ఐఈఆర్‌సీ) ఏర్పాటు చేసింది. వీటినే భవిత కేంద్రాలుగా పిలుస్తుంటారు. జిల్లాలో 28 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 7 మండలాల్లో సొంత భవనాల్లో ఈ కేంద్రాలు ఉండగా మిగతా 21 మండలాల్లో పాఠశాలల ఆవరణలోనే ఒక గదిలో (ఐఈఆర్‌సీ) కొనసాగిస్తున్నారు. వీరికి ఐఈఆర్‌పీ (ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు సమ్మిళిత విద్యా విధానంతో ఈ చిన్నారులకు శిక్షణనిచ్చి సాధారణ పిల్లల్లా తీర్చిదిద్దుతుంటారు. భవిత కేంద్రాలకు రాలేని మానసిక వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దకే వెళ్లి నైపుణ్యాలు నేర్పిస్తుంటారు. జిల్లాలో 46 మండలాలకు గాను 41 మంది వరకు ఐఈఆర్‌పీలు ఉన్నారు. ప్రతి శనివారం ఒక్కో ఐఈఆర్‌పీ తమ పరిధిలోని ఇలాంటి పిల్లల ఇళ్లకు వెళ్లి బోధిస్తుంటారు.

లబ్ధిదారుల ఖాతాలో జమవుతాయి



పాఠశాలలు, భవిత కేంద్రాలు, ఇంటి వద్ద శిక్షణ పొందుతున్న మానసిక, శారీరక వైకల్యం కలిగిన పిల్లలకు ప్రభుత్వం రవాణా, ఎస్కార్ట్, స్టైపండ్, రీడింగ్ అలవెన్స్‌లను ప్రభుత్వం ఏటా అందజేస్తోంది. ప్రస్తుతం జిల్లాకు సంబంధించిన లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వమే నేరుగా జమచేయడం జరుగుతుంది.

– యర్రంశెట్టి రాంబాబు, జిల్లా విలీన విద్య సమన్వయకర్త, సూర్యాపేట

వివిధ కేటగిరీల కింద..

- భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ పిల్లలకు నెలకు రూ.500 చొప్పున పది నెలలు రవాణా భత్యం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.5 వేల చొప్పున ఏటా చెల్లిస్తాయి. 1–12 తరగతి వరకు లబ్ధి పొందవచ్చు.
- అంధత్వం, అంగవైకల్యం కలిగి పాఠశాలలకు వచ్చి చదివే వారికి నెలకు రూ.550 చొప్పున, పది నెలలకు రూ.5,500లు అందజేస్తారు. ఆ విద్యార్థులను కుటుంబ సభ్యులు ఎవరైనా తీసుకొని వస్తుండటంతో ఎస్కార్టు భత్యం కింద వీటిని అందిస్తారు. ప్రభుత్వం పొందుపరచిన దివ్యాంగుల జాబితాలో ఉన్న వర్గాల వారు 1 నుండి 12వ తరగతి వరకు ఈ భత్యం పొందవచ్చు.
- పాఠశాలలు, భవిత కేంద్రాలు, ఇంటి వద్ద విద్య పొందే బాలికలకు స్టైఫండ్ కింద నెలకు రూ.200 చొప్పున అందిస్తుంటారు. వీరికి కూడా పది నెలలకు రూ.2 వేలు వస్తాయి. 1–12వ తరగతి వరకు పొందే వీలుంది.
- అంధులు, తక్కువ దృష్టి కలిగిన పిల్లలకు రీడింగ్ భత్యం పేరుతో నెలకు రూ.60 చొప్పున పది నెలలకు రూ.600 చెల్లిస్తారు. వీరు కూడా 1–12 తరగతి వరకు పొందవచ్చు.

యాదాద్రీశుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు. అదేవిధంగా సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు: మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ కూర్మానాయక్ హెచ్చరించారు. గురువారం సాక్షి దినపత్రికలో 'మునుగోడులో మైనర్లకు మద్యం విక్రయాలు' అనే వార్త ప్రచురితం కాగా.. చండూరు ఎక్సైజ్ సీఐ జిలానీ బేగం ఆదేశాల మేరకు ఎస్ఐ కూర్మానాయక్ మండల కేంద్రంలోని నాలుగు వైన్స్‌లను తనిఖీ చేశారు. నాలుగు రోజుల క్రితం చౌటుప్పల్ రోడ్డులోని ప్రసాద్ వైన్స్ పర్మిట్ రూమ్‌లో ఇద్దరు మైనర్లు కూర్చుని ఉన్న దృశ్యాలను పరిశీలించిన ఎస్ఐ వైన్స్ నిర్వాహకులను ప్రశ్నించగా.. ఆ మైనర్లు మద్యం తాగలేదని, ఎండ ఎక్కువగా ఉండడంతో తమకు సంబంధించిన వారి వెంట వచ్చి పర్మిట్ రూమ్‌లో కూర్చున్నారని వైన్స్ నిర్వాహకులు తెలిపినట్లు పేర్కొన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని, అంతేకాకుండా నిర్ణీత సమయానికి మాత్రమే దుకాణాలు తెరవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి : రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం నార్కట్‌పల్లి శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ సాజిద్ బొలేరో వాహనంలో చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పక్కన గల దుర్గ హోటల్ ముందు గురువారం ఉదయం 5.30గంటల సమయంలో తన వాహనం ఆపి బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు సాజిద్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన సాజిద్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

పూలే జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావ్ పూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని ప్రముఖ డాక్టర్, సామాజికవేత్త జాడీ రాజు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ గురువారం మిర్యాలగూడ పట్టణంలో ఆవిష్కరించారు. అనంతరం పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘం నేత రామకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సైదులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత పాలగాని వెంకటేశ్వర్లు, పొదిల సత్యనారాయణ, గూడపూరి శ్రీనివాస్, మంద శ్రీనివాస్ తదితరులున్నారు.

కేతేపల్లిలో విషాదఛాయలు

- రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి


ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి: సూర్యాపేట మండలంలోని రాయినిగూడెం శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందగా.. మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుల్లో ఒకరైన అంతటి నవీన్(20)ది రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం. నవీన్ తండ్రి సైదులు పదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి నాగమణి ఆకుకూరలు అమ్ముకుంటూ కూతురు పెళ్లి చేసింది. నవీన్‌ను డిగ్రీ వరకు చదివించింది. చదువు పూర్తయి ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉంటాడని అనుకుంటున్న దశలో నవీన్ మృత్యువాత పడటంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. రెక్కల కష్టంతో పెంచి పెద్దచేసిన ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందటంతో నాగమణి కన్నీరుమున్నీరుగా విలపించింది. మరో యువకుడు జటంగి సాయి(17) నిరుపేద వ్యవసాయ కుటుంబం. సాయి తండ్రి సొడయ్య తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సాయి ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాసి హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. గారాబంగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. రోడ్డు ప్రమాదంలో కేతేపల్లికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారనే సమాచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో గ్రామస్తులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి నుంచి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలివెళ్లారు. సాయి, నవీన్ మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయిన తర్వాత నేరుగా కేతేపల్లికి తీసుకొచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య గురువారం రాత్రి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్యే పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు యువకుల మృతదేహాలను సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అనంతరం తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అబ్బూరి గణేష్, కావేటి శివను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఇనుపాముల ఎంపీటీసీ బొజ్జ సుందర్, కాంగ్రెస్ నాయకులు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, గుత్త మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

కేసు నమోదు..

సూర్యాపేట : మండలంలోని రాయినిగూడెం శివారులో గల రాజుగారి తోట హోటల్ సమీపంలో గురువారం విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సూర్యాపేట నుంచి కేతేపల్లి వైపు వేగంగా వెళ్తున్న కారు రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టగా.. అందులో ప్రయాణిస్తున్న కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన జటంగి సాయి, అంతటి నవీన్ అక్కడికక్కడే మృతి చెందారని సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపారు. కారులోనే ప్రయాణిస్తున్న అబ్బూరి గణేష్, కావటి శివకు గాయాలు కాగా.. మారగోని మహేష్, ఉదయ్, కారు డ్రైవర్ చింతపల్లి ధనుష్ అలియాస్ బన్నీ అక్కడి నుంచి పారిపోయారని పేర్కొన్నారు. అబ్బూరి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతివేగంగా కారు నడిపి ఇద్దరు యువకుల మృతికి కారణమైన చింతపల్లి ధనుష్ అలియాస్ బన్నీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


సూర్యాపేట ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు


సాయి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పోలీసుల తనిఖీలు.. నగదు పట్టివేత

చండూరు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో చండూరు మండలం అంగడిపేట గ్రామ శివారులో పెట్రోల్ బంక్ వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. బంగారిగడ్డ గ్రామం వైపు నుంచి కారులో వస్తున్న మార్గం శంకర్ వద్ద రూ.85,000 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఉప్పు సురేష్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


చండూరు : నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ సురేష్‌కుమార్

రూ.80వేల నగదు స్వాధీనం

మద్దిరాల : మండల పరిధిలోని కుంటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఒక వాహనంలో సరైన ఆధారాలు లేని రూ.80,000ల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మధునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు ఎంపీఓ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు

- పసికందు మృతి.. మరో ముగ్గురికి గాయాలు
- హనుమకొండ జిల్లాలో ఘటన


మృతిచెందిన పసికందు (బాలుడు)

ఆత్మకూరు(పరకాల): దైవ దర్శనానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పసికందు మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం గుడెప్పాడ్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన ఎలగందుల శ్రీకాంత్, స్రవంతి దంపతుల మూడేళ్ల కుమార్తె శ్రీనిక, మూడు నెలల పసికందు (బాలుడు) ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు లక్ష్మీనృసింహుడి దర్శనానికి కారులో బయల్దేరారు. దర్శనం అనంతరం తిరిగి వస్తున్న క్రమంలో గుడెప్పాడ్ సమీపంలో గురువారం రాత్రి జాతీయ రహదారి(163)పై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. కారులో ఉన్న పసికందు మృతిచెందగా.. శ్రీకాంత్, స్రవంతి, శ్రీనికకు గాయాలయ్యాయి. వీరిని ఎంజీఎంకు చికిత్స నిమిత్తం 108 వాహనంలో తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ రాజేష్ చంద్ర, పోలీసులు

మోటకొండూర్: ఇంటి మేడపై నిద్రిస్తున్న మహిళ మెడలోంచి గుర్తుతెలియని వ్యక్తి పుస్తెలతాడు అపహరించాడు. ఈ ఘటన మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేపల్లి గ్రామానికి చెందిన గడ్డం నిర్మల(40) వేసవి కావడంతో తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి బుధవారం రాత్రి ఇంటి మేడపై నిద్రించారు. గురువారం తెల్లవారుజామున నిర్మల మెడలోని 3.4తులాల పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి కట్ చేసి తీసుకెళ్తుండగా.. అలికిడికి ఆమె లేచి చూసేసరికి సదరు వ్యక్తి మేడ పైనుంచి కిందకు దిగి పరుగు లంకించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, ఏసీపీ రమేష్, సీఐ కొండల్‌రావు, ఎస్ఐ తేజంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గురువారం ఉదయం నిర్మల స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇలాంటి దొంగతనాలు ఈ మధ్య తరచు జరుగుతుండటంతో దొంగను పట్టించిన వ్యక్తికి రూ.25వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పోలీసులు ప్రకటించారు.

తల్లిదండ్రులు కలిసి ఉండటం లేదని కుమార్తె ఆత్మహత్య

నల్లగొండక్రైం : తల్లిదండ్రులు కలిసి ఉండటం లేదని కుమార్తె ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌లో జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం మాచినపల్లికి చెందిన పగిళ్ల సైదులు, సంధ్యారాణి భార్యాభర్తలు. వీరికి కుమార్తె యోగిత(22) ఉంది. సైదులు, సంధ్యారాణి మధ్య మనస్పర్థలు రావడంతో సైదులు నల్లగొండ పట్టణంలో సావర్కర్ నగర్‌లో ఒంటరిగా నివాసముంటున్నాడు. సంధ్యారాణి గాంధీనగర్‌లో ఒంటరిగా నివసముంటూ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. యోగిత హైదరాబాద్‌లో పీజీ సెకండియర్ చదువుతోంది. ఉగాది పండుగకు తల్లి సంధ్యారాణి వద్దకు వచ్చిన యోగిత తల్లిదండ్రులు కలిసి ఉండకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం తల్లి సంధ్యారాణి డ్యూటీకి వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి 9గంటల సమయంలో డ్యూటీ నుంచి వచ్చిన సంధ్యారాణి యోగిత ఉరేసుకోవడం చూసి భర్తకు ఫోన్ చేసింది. వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దేశంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం

హుజూర్‌నగర్: ప్రస్తుతం దేశంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం కొనసాగుతోందని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి ఆరోపించారు. గురువారం హుజూర్‌నగర్‌లో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని కూలదోసి రైతురాజ్యం తేవాలని పిలుపునిచ్చారు. అందుకు రైతాంగం ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో రైతు, మత్స్య సంఘాల జిల్లా, మండల నాయకులు శ్రీను, సైదులు, మురళి, హుస్సేన్, వెంకటరెడ్డి, వీరబాబు, యోనా, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, వీరమల్లు, వీరస్వామి, వెంకన్న పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న పల్లె వెంకటరెడ్డి

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం


గరిడేపల్లి : మంగాపురంలో మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది


మిర్యాలగూడ టౌన్ : మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గరిడేపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండల పరిధిలోని మంగాపురం గ్రామంలో గురువారం జరిగింది. వివరాలు.. మంగాపురం గ్రామానికి చెందిన ధరావత్ వెంకన్న, అకర్, సఖ్య, ధర్మ, అంజయ్య, సైదా 20 ఎకరాల్లో వరి పొలం కోసిన తర్వాత గడ్డిని కట్టలుగా కట్టి గ్రామ శివారులో గడ్డివాములు వేసుకున్నారు. ఈ గడ్డివాములకు దగ్గరలో విద్యుత్ మోటారు ఉండడంతో గురువారం షార్ట్ సర్క్యూట్ అయ్యి గడ్డివాములు తగలబడ్డాయి. ఫైరింజన్ వచ్చే సరికే చాలావరకు గడ్డి దగ్ధం కాగా.. మిగతా గడ్డివాములను మంటల నుంచి కాపాడారు.

గోపసముద్రం తండాలో..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం గోపసముద్రం తండాలో గురువారం ప్రమాదవశాత్తు గడ్డి మోపులు దగ్ధమయ్యాయి. వివరాలు.. గోపసముద్రం తండాకు చెందిన పాల వ్యాపారి అజ్మీరా బాబు తన పశువుల కోసం సుమారు రూ.లక్షతో 600 గడ్డి మోపులు కొనుగోలు చేసి ఇంటి వద్దనే ఉంచాడు. అతడు రోజు మాదిరిగానే గురువారం ఉదయం ఇంటింటికి వెళ్లి పాలు అమ్ముకొని తిరిగి వచ్చేసరికి గడ్డి మోపులు దగ్ధం కావడం గమనించి కన్నీటి పర్యంతమయ్యాడు. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసి, మిర్యాలగూడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. ఇంటింటికి తిరిగి పాలు అమ్ముకొని జీవనం సాగిస్తున్న అజ్మీరా బాబును ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరారు.

రైతాంగ పోరాటం స్ఫూర్తిదాయకం


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : రైతాంగ పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ (ఏఐకేఎస్) జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఆ సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో 1936లో ఏర్పడిన అఖిల భారత కిసాన్ సంఘ్ రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, దున్నేవారికే భూమి అనే నినాదంతో పోరాడిందని తెలిపారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమించిందని.. నాటి ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో రైతాంగ ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి వామపక్ష అభ్యుదయ భావాలు కలిగిన నాయకులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డబ్బికార్ మల్లేష్, రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి, మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఊర్మిళ, గోవింద్‌రెడ్డి, చౌగాని వెంకన్న, కోటిరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి పువ్వుకు భలే డిమాండ్!

- కర్ణాటక నుంచి దిగుమతి
- ఒక్క కాయ రూ.80 చొప్పున రహదారుల వెంట విక్రయాలు
- కొబ్బరి పువ్వు ఆరోగ్యానికి ఎంతో మేలంటున్న వ్యాపారులు



నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో ఏర్పాటు చేసిన కొబ్బరి పువ్వుల విక్రయ ఆటో

నల్లగొండ రూరల్: కొబ్బరి పువ్వుకు మార్కెట్‌లో భలే డిమాండ్ ఉంది. రుచికరంగా ఉండటంతో చిన్నారులు, పెద్దలు కొబ్బరి పువ్వును తినడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎన్నో ఔషధ గుణాలు ఉన్న కొబ్బరి పువ్వు తినడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని అమ్మకందారులు చెబుతుండటంతో వినియోగదారులు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. కర్ణాటక నుంచి కొబ్బరి కాయలను దిగుమతి చేసుకుని రహదారుల వెంట విక్రయిస్తున్నారు. ఒక్క కాయ రూ.80కి విక్రయిస్తున్నారు. ఏడాది పొడవునా కొబ్బరి పువ్వు లభిస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. కొబ్బరికాయలను నర్సరీల్లాగా పెంచి పిలకలు వచ్చిన తర్వాత గేగులు తరహాలో అమ్ముతున్నారు. దేవరకొండ రోడ్డులో సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్ వద్ద రోజు 200 కొబ్బరి పువ్వులు విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు.

కొనుగోలుకు ఆసక్తి



కొబ్బరి పువ్వు కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. రెండేళ్లుగా వ్యాపారం చేస్తూ రోజుకు 200 కొబ్బరి పువ్వులు అమ్ముతున్నాం. కొబ్బరి పూలతో గుండె, కిడ్నీలో రాళ్లు, థైరాయిడ్ సమస్యలు రాకుండా చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు షుగర్‌ను నియంత్రిస్తుంది.

– శ్రీనివాస్, వ్యాపారి, సూర్యాపేట

నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశం

కట్టంగూర్: కట్టంగూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో 2019–20 నుంచి 2022–23 వరకు జరిపిన ధాన్యం కొనుగోళ్ల కమీషన్ నిధులు దుర్వినియోగం చేశారనే ఫిర్యాదుపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ దృష్టి సారించింది. ధాన్యం కొనుగోలు కమీషన్ మొత్తానికి సంబంధించి నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నల్లగొండ విజిలెన్స్ అధికారులు కట్టంగూర్ మండల సమాఖ్య కేంద్రానికి గురువారం నోటీసులు జారీ చేశారు. 2019–20 నుంచి 2022–23 వరకు ధాన్యం కొనుగోళ్లతో వచ్చిన కమీషన్ వివరాలు, రిజిస్టర్లు, రశీదులు, వోచర్లు, నగదు పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం ఇతర రికార్డుల వివరాలు అందజేయాలని కట్టంగూర్ ఏపీఓకు నోటీసులు జారీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడిగిన సమాచారం త్వరలో అందజేస్తామని ఏపీఓ కె.సైదులు తెలిపారు.

డ్రిప్ నిర్వహణలో జాగ్రత్తలు తప్పనిసరి

- హార్టికల్చర్ కన్సల్టెంట్ షేక్ ఇస్మాయిల్


షేక్. ఇస్మాయిల్, హార్టికల్చర్ కన్సల్టెంట్

పాడి పంట

నడిగూడెం : రాయితీతో తీసుకునే సూక్ష్మ సేద్యపు పరికరాలు(డ్రిప్, స్ప్రింక్లర్లు) రెండోసారి తీసుకోవాలంటే ఏడేళ్లు ఆగాల్సిందే. అంతవరకు వాటిని జాగ్రత్తగా వాడుకోవాలని, ప్రస్తుత వేసవిలో వాటిని ఎలా వినియోగించుకోవాలో హార్టికల్చర్ కన్సల్టెంట్ షేక్.ఇస్మాయిల్ రైతులకు ఇస్తున్న సూచనలు ఆయన మాటల్లోనే.. ఒకసారి పొలంలో అమర్చుకున్న డ్రిప్ పరికరాల పనితీరు, చిన్నపాటి మరమ్మతులపై అవగాహన కలిగి ఉండాలి. డ్రిప్ సిస్టమ్ హెడ్ కంట్రోల్ యూనిట్‌లో వివిధ రకాల ఫిల్టర్లు నీటిలోని ఇసుక, ఆల్గే (నాచు) చెత్త, మలినాలు వేరు చేసేందుకు అమర్చబడి ఉంటాయి. అవి మూసుకుపోకుండా ఫిల్టర్లను తరచూ శుభ్రం చేసుకోవాలి. అందులో శాండ్ (ఇసుక) ఫిల్టర్‌ను బ్యాక్‌వాష్ పద్ధతిలో శుభ్రం చేసుకోవాలంటే అందులో ఉండే నాలుగు వాల్వ్‌ల గురించి తెలుసుకోవాలి. సిస్టమ్ నడుస్తున్నప్పుడు 2, 4 నంబర్ వాల్వులు తెరిచి 1,3 నంబర్ వాల్వులు పూర్తిగా మూసివేసి నీటిని పంపించాలి. తద్వారా నీళ్లు, ఇసుక బెడ్ ద్వారా ప్రవహించడం వలన శుభ్రపడతాయి. రెండో పద్ధతి ప్రకారం ఇసుక బెడ్‌లోని ఖాళీలు మూసుకుపోయినప్పుడు ముందుగా 1,3 నంబరు గల వాల్వులు తెరిచి తర్వాత 2, 4 నంబర్ గల వాల్వులు మూసేసి నీటిని నింపడం ద్వారా అందులో మలినాలు 1వ నంబర్ వాల్వు ద్వారా బయటకు పోయి ఇసుక బెడ్ శుభ్రమవుతుంది. ఈ పద్ధతిని శాండ్ ఫిల్టర్ అమర్చిన రెండు ప్రెషర్‌గేజ్‌ల మధ్య తేడా 0.5 కిలో లేదా 0.5.సెం.మీ కన్నా ఎక్కువగా పెరుగుతున్నప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఫిల్టర్ ఇసుక ఉండాల్సిన మట్టానికి తక్కువైనప్పుడు తిరిగి మట్టానికి ఇసుక నింపుకోవాలి. బ్యాక్‌వాష్ చేసే ముందు శాండ్ ఫిల్టర్ మూత తెరిచి చేతులతో ఇసుక బెడ్‌ను కలియబెట్టాలి. ఇలా చేయడం వలన ఫిల్టర్‌ను తొందరగా శుభ్రం చేసుకోవచ్చు.


డ్రిప్ పద్ధతిలో సాగులో ఉన్న చెరకు

స్క్రీన్ ఫిల్టర్ శుభ్రం ఇలా...

సిస్టమ్ నడుస్తుండగా స్క్రీన్ ఫిల్టర్‌ను శుభ్రం చేసుకోవాలంటూ ఫిల్టర్ కింది భాగంలో అమర్చిన డ్రైన్ వాల్వును తెరిస్తే స్క్రీన్‌మెష్‌పై ఉన్న మలినాలు ఈ వాల్వు ద్వారా బయటకు పోతాయి. చాలాసార్లు మలినాలు ఫిల్టర్ మెష్‌పై పేరుకుపోయి మెష్‌పైనే అంటుకొని ఉంటాయి. అలాంటప్పుడు పంపు ఆఫ్ చేసి ఫిల్టర్ మూతను తెరిచి ఫిల్టర్‌లోని మెష్‌ను బయటకు తీసి పేరుకపోయిన మలినాలను సున్నితమైన ప్లాస్టిక్ బ్రష్ లేదా చేతి వేళ్లతో శుభ్రం చేయాలి. (మెష్ చిరిగిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి) స్క్రీన్ ఫిల్టర్‌లో మెష్ లేకుండా నడపకూడదు. పేడ, ఇతర సేంద్రియ ఎరువులను డ్రిప్ ద్వారా పంపకూడదు. దీని వల్ల ఫిల్టర్లు, డ్రిప్పర్లు మూసుకపోతాయి. ఇక పీవీసీ పైపులు, లేటరల్ పైపులు శుభ్రం చేసుకొనేందుకు ఎండ్‌క్యాప్ లేదా ఎండ్‌ప్లగ్ ప్రతివారం లేదా కనీసం 15 రోజులకోసారి తెరిచి నీటిని పూర్తి ప్రెషర్‌తో లోపలికి పంపితే తెరిచి ఉంచినప్పుడు ఎండ్‌ప్లగ్ చివర్ల ద్వారా మలిన పదార్థాలు బయటకు కొట్టుకపోతాయి. మూడు నెలలకొకసారి లేదంటే కనీసం ఆరు నెలలకు ఒకసారి కచ్చితంగా యాసిడ్ ట్రీట్‌మెంట్(ఆమ్లచికిత్స) ద్వారా డ్రిప్ యూనిట్‌ను బాగా శుభ్రం చేసుకోవాలి. యాసిడ్ ట్రీట్‌మెంట్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే పాడైపోయే ప్రమాదం ఉంటుంది.